క్లుప్తంగా

రేపు ప్రవేశ పరీక్ష

పెద్దతిప్పసముద్రం : స్థానిక మోడల్ స్కూల్‌లో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతిలో చేరేందుకు సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శివకుమారి అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సదరు విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు రెండు పాస్ ఫొటోలతో పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

సైన్స్ మన జీవితంలో భాగం

కలకడ : సైన్స్ మన జీవితంలో భాగమని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో అటల్‌బూట్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అటల్‌బూట్ క్యాంపుల ద్వార విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఆధునిక ప్రపంచంలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం లేకుండా జీవితాన్ని ఊహించలేమన్నారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలవిద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లి తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

పీలేరురూరల్ : కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టులో న్యాయవాదులకు, పోలీసులకు, అధికారులతో సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మే 10న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను ఇరు వర్గాలను పిలిపించి ఇరువురిని ఒప్పించి వారి అభీష్టం మేరకు రాజీ కుదిర్చాలన్నారు. చెక్‌బౌన్స్, భూ తగాదాలు లాంటి కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సి. పురుషోత్తంరెడ్డి, ఎంపీడీవో శివశంకర్, సీఐ యుగంధర్, ఈవో గురుమోహన్, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

పెద్దతిప్పసముద్రం : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యమ్మ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని మద్దయ్యగారిపల్లిలో సెక్టార్ స్థాయి పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. వెయ్యి రోజుల సంరక్షణ, మొబైల్ అప్లికేషన్ యాప్, రిజిస్టర్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలకు మంజూరవుతున్న పోషక పదార్థాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ భవాని, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు విశేషమైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు.

పీడీ పోస్టులు రద్దు చేయొద్దని వినతి

మదనపల్లె సిటీ : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు రద్దు చేయవద్దని వ్యాయామ ఉపాధ్యాయులు శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వినతిప్రతం అందజేశారు. కాలేజీల్లో జూనియర్ లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను రద్దు చేయడం దారుణమన్నారు. పీడీ పోస్టులు రద్దు కావడం వల్ల విద్యార్థులు క్రీడలకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పీడీలు మురళి, నరేష్‌బాబు, దేవకమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల గోడు పట్టించుకోరా?

పెద్దతిప్పసముద్రం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని అన్నమయ్య జిల్లా దివ్యాంగుల జేఏసీ నాయకుడు సురేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న దివ్యాంగుల్లో చాలా మంది ఇతరులపై ఆధార పడకుండా సామర్థ్యం ఉన్న వారికి ప్రభుత్వం స్వయం ఉపాధి రాయితీ రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు నెలవారి పింఛన్లు అందజేసి చేతులు దులుపుకోకుండా ప్రభుత్వం వారిలో నున్న ప్రతిభను గుర్తించి 2016 దివ్యాంగుల చట్టానికి అనుగుణంగా రుణాలను మంజూరు చేసి వారికి అన్ని విధాలా చేయూత నివ్వాలని కోరారు.

వైద్య శిబిరం విజయవంతం

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో శనివారం జరిగిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. క్యాన్సర్, గుండె, కీళ్ళు, ఎముకల వైద్య నిపుణులు శిబిరానికి వచ్చిన 212 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. వీరిలో 30 మంది ఉచిత ఆపరేషన్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు లక్ష్మణ్, సూరి, రెడ్డిబాషా, అనిల్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను అరికడదాం.. ప్రకృతిని రక్షిద్దాం


గుర్రంకొండ: మాట్లాడుతున్న రాయచోటి డీఎల్‌డీఓ లక్ష్మీపతి


నిమ్మనపల్లె : ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ తదితరులు


కలకడలో మానవహారంగా ఏర్పడ్డ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది

- ఘనంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర
- మానవహారాలు, ప్రతిజ్ఞలతో ప్రజలకు అవగాహన

నిమ్మనపల్లె : ప్లాస్టిక్‌ను అరికడదాం.. ప్రకృతిని రక్షిద్దామని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం నిమ్మనపల్లెలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులతో కలసి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉర్దూ ఉన్నత పాఠశాల నుంచి స్థానిక బస్టాండ్ కూడలి వరకు మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది, సచి వాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ర్యాలీ చేశారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి, ప్లాస్టిక్ వాడకం నిషేధంపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఏపీఓ రమేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ రెడ్డి, రాజేష్‌పాల్గొన్నారు.

పారిశద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పీలేరురూరల్ : ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్, స్పెషల్ మెజిస్టేట్ జడ్జి మురళీ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కోర్టు ఆవరణం, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపయోగ వస్తువులతో వచ్చే అనారోగ్య సమస్యలు గురించి వివరించారు. ఈఓ గురుమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : స్వచ్ఛ ఆంధ్ర కోసం అందరూ సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి, కమిషనర్ ప్రమీల, మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి, మెప్మా సీఎంఎం పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుర్రంకొండ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని రాయచోటి డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. శనివారం మండలకేంద్రమైన గుర్రంకొండలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలి నిర్వహించి బస్టాండులో మానవహారం నిర్వహించారు. అక్కడే అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశులు, ఏఓ నాగశివారెడ్డి, ఈఓపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, మండలవైద్యాధికారి రవీంద్రనాయక్, ఎంఈఓలు సుబ్రహ్మణ్యం, సురేంద్రబాబు, ఏఓ రత్నమ్మ పాల్గొన్నారు.

శ్రీ రెడ్డెమ్మకొండలో..

మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయపరిసరాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శనివారం శ్రీరెడ్డెమ్మకొండ ఈఓ మంజుల ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల్లోని అమ్మవారి పుష్కరిణి పరిసరాల్లో పచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రీ సైక్లింగ్‌పై అవగాహన

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం ఈ -వ్యర్థాల, రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఏఓ థామస్, ఏపీఎం గంగాధర్, ఏపీఓ అంజనప్ప, వెలుగు,సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలకడ : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండలప్రత్యేక అధికారి రవిచంద్రబాబు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ అబ్దుల్‌రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. మూడురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్యారీజాన్, ఇనాయతుల్లా, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. కలకడలో మానవహారం గా ఉన్న ప్రత్యేక అధికారి రవిచంద్రబాబు పాల్గొన్నారు.

ర్యాలీ

బి.కొత్తకోట : స్థానిక నగర పంచాయతీ కమిషనర్ పల్లవి ఆధ్వర్యంలో శనివారం బి.కొత్తకోటలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ఐకేపీ సంఘమిత్రలు కార్యాలయం నుంచి బైపాస్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు మీదుగా జ్యోతిచౌక్ చేరుకుని మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ రమాదేవి, మాజీ ఉపసర్పంచు సమీవుల్లా పాల్గొన్నారు. మండలంలోని గట్టులో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఎంఈవో రెడ్డిశేఖర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో ఈ వ్యర్థాల నిర్వహణపై ఉపాధ్యాయులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిమ్మనపల్లె : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలానికి 9 యూనిట్లు నిమ్మనపల్లె మదనపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకు, నిమ్మనపల్లి ఇండియన్ బ్యాంక్ పరిధిలో మంజూరు అయ్యాయన్నారు. లబ్ధిదారులు తీసుకున్న రుణం మొత్తంలో 5 శాతం భరించాలని, 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ పోగా, 55 శాతం బ్యాంకు రుణం ఇస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉన్న అభ్యర్థులు మే నెల 10వ తేదీలోగా అవసరమైన యూనిట్లను ఎంచుకొని ఏపీఓబీఎంఎంఎస్ వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరు : రొంపిచెర్ల మండలం మోటుమల్లెలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బి. వెంకటరమణారెడ్డి కుమారుడు మనోజ్‌కుమార్‌రెడ్డితో యర్రావారిపాళెం మండలం, ఉస్తికాయలపెంటకు చెందిన జి. శ్రీనాథరెడ్డికుమార్తె సుష్మిత వివాహం స్థానిక ఎంఎన్‌ఆర్ కల్యాణమండపంలో జరిగింది. ఈ వివాహానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు కంభం సతీష్‌రెడ్డి, చిచ్చి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, నాయకులు ఆనంద్, మహిత, ఉదయ్, చక్రధర్, షాకీర్, మునీర్, అబీద్, నాగభూషణం, చక్రపాణిరెడ్డి, నాగరాజనాయక్, జయరామచంద్రయ్య, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓలు

గుర్రంకొండ : పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. శనివారం మండలంలోని సంగసముద్రం, సరిమడగు, గుర్రంకొండలో ఉపాధ్యాయులతో కలసి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదవ తరగతి చదవు పూర్తి చేసుకొన్న విద్యార్థినీ, విద్యార్థులు, హైస్కూల్ విద్య కొరకు గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్లో అడ్మిషన్ చేసుకోవాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సౌకర్యాలు ఉన్నాయన్నారు. అత్యుత్తమ శిక్షణతోపాటు క్రీడలు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రికల్, ఒకేషనల్ కోర్సులతో హైస్కూల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, హెడ్మాస్టర్ మదన్‌మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పీలేరు : ప్రజలు అప్రమత్తతతో ఉంటే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి పి. అనిల్‌కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులపై డెమో చూపించారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, అగ్నిమాపక అధికారి మస్తాన్, సిబ్బంది నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, చలపతి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, రెడ్డిశేఖర్, మహబూబ్‌బాష, చైతన్యకుమార్, జాకీర్, షఫీ పాల్గొన్నారు.

ములకలచెరువు : ఇళ్లలో వంటగ్యాసు ఉపయోగంలో మహిళలు మెలకువలు వహించాలని అగ్నిమాపక అధికారి నరసింహులు కోరారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మహిళలతో వంటగ్యాసుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఫైర్ సిబ్బంది ఉన్నారు.

నివాళి


మహేష్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పెద్దమండ్యం : మండలంలోని మండలవాండ్లపల్లె పంచాయతీ దండువారిపల్లెకు చెందిన పార్టీ క్రియాశీలక కార్యకర్త, యువనాయకుడు మహేష్‌రెడ్డి మృతికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శనివారం నివాళులర్పించారు. ఇటీవల బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్‌రెడ్డి గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం దండువారిపల్లెకు చేరుకుని మహేష్‌రెడ్డి మృతదేహానికి నివాళిలర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేష్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీటీ రెడ్డిశేఖరరెడ్డి, నాయకులు కన్నప్ప పెద్దరెడ్డెప్పరెడ్డి, సుబ్బారెడ్డి, నిరంజనరెడ్డి పాల్గొన్నారు.

మదనపల్లె : పట్టణంలోని త్యాగరాజ వీధిలో నివాసం ఉంటున్న నసీబ్ శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ శనివారం త్యాగరాజ వీధికి చేరుకుని నసీబ్ మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం


నిసార్ అహ్మద్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిమ్మనపల్లె : మండలంలో గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని, రాబోయే ఎన్నికల్లో మదనపల్లెలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపిస్తామని నిమ్మనపల్లె మండల పార్టీ నూతన కమిటీ సభ్యులు అన్నారు. శనివారం మదనపల్లె వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీలో వివిధ హోదాల్లో పదవులు పొందిన నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలు వేసి, బొకేలు అందించి ఆయనను దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడే నిమ్మనపల్లె మండల నాయకులు కష్ట సమయంలో పార్టీని నమ్మి పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షులు శ్రీనివాసుల రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజ, యూత్ ప్రెసిడెంట్ యోగానంద రెడ్డి, కార్యదర్శి ఖాదర్ బాషా, బూత్ కమిటీ కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజగోపాల్, రైతు విభాగ అధ్యక్షుడు విజయ్ భాస్కర్‌రెడ్డి, విద్యార్థి విభాగం ప్రశాంత్, నాగమణి, బీసీ సెల్ రమేష్ బాబు, రామయ్య పాల్గొన్నారు.

రైతులను బలి పశువులు చేస్తారా?

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన చిరుత మతి ఘటనలో పొన్నుటిపాలెం రైతులను బలి పశువులు చేస్తారా? అని మదనపల్లె నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ ప్రశ్నించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చిరుత మృతి అనంతరం జరిగిన సంఘటనలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకుంటూ రైతులపై కేసులు పెట్టారని ఆక్షేపించారు. మదనపల్లె సమీపంలోని పిచ్చర్లవాండ్లపల్లి నుంచి హార్సిలీ హిల్స్ వరకు ఉన్న అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం ఉందని అటవీశాఖ అధికారులకు ముందస్తు సమాచారం ఉందన్నారు. చిరుతలు సంచరిస్తూ చుట్టుపక్కల గ్రామాల్లో పశువులపై దాడి చేసిన ఘటనలు సైతం రైతులు అధికారుల దృష్టికి తెచ్చారన్నారు. చిరుత ఉచ్చులో పడిన రోజున స్థానికులు తెల్లవారి 6 గంటలకు అధికారులకు సమాచారం ఇచ్చారని, 9 గంటలకు సంఘటన స్థలానికి వెళ్లిన అధికారులు చిరుతను కాపాడే ప్రయత్నాలు చేయడంలో విఫలమయ్యారన్నారు. అధికారుల నిర్లక్ష్యం సామర్థ్య లోపం కారణంగానే చిరుత మృతి చెందిందని తెలిపారు. అధికారులు తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రైతులపై కేసులు పెట్టారన్నారు. చిరుత మృతికి కారణమైన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున్ రెడ్డి, కొత్తపల్లి మహేష్, శారదరెడ్డి, మేరీ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో సత్తా


విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కృష్ణారెడ్డి

మదనపల్లె సిటీ : జేఈఈ మెయిన్ ఫలితాల్లో మదనపల్లె క్రిష్ణారెడ్డి సిద్ధార్థ విద్యార్థులకు ర్యాంకులు వచ్చినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్.క్రిష్ణారెడ్డి తెలిపారు. ఎ.వెంకట సాయిదీపక్ 93.68, కె.సాయిసుదీక్ష 93.48, డి.పవన్ తేజ్‌రెడ్డి 93.28, ఎస్.స్పందన 89.77 పర్సంటైల్ వచ్చినట్లు తెలిపారు. వీరితో పాటు 30 మంది విద్యార్థులకు వివిధ కేటగిరీల్లో జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

జేఈఈ మెయిన్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మదనపల్లె వెంకటరెడ్డి సిద్ధార్థ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు కాలేజీ ప్రిన్సిపాల్ ఈ.వెంకటరెడ్డి అభినందించారు. బి.తనుశ్రీ 95.88, దేదీప్యసాయి 93.66, మహమ్మద్‌సోహిల్ 90.56,జి.మిథున్ హరిహరన్ 88.83, పి.అల్మాస్ 82.88, డి.మోక్షణరెడ్డి 80.30 పర్సంటైల్ సాధించారన్నారు. దేదీప్య ఆలిండియా స్థాయిలో 3578 ర్యాంకు, తనుశ్రీ 8973 ర్యాంకు సాధించారన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

జ్ఞానాంబిక విద్యార్థినికి ర్యాంకు

జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో మదనపల్లె జ్ఞానాంబిక జూనియర్ కాలేజీ విద్యార్థిని బి.సద్విక రాజ్‌కు మంచి ర్యాంకు సాధించినట్లు కాలేజీ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. బి.సద్వికరాజ్‌కు 83.33 పర్సంటైల్ వచ్చినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 982 మార్కులు సాధించిందన్నారు. విద్యార్థిని కాలేజీ ప్రిన్సిపాల్ రాటకొండ చలపతి, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు


చిట్టిబోయనపల్లె ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ పంచాయతీ చిట్టిబోయన పల్లె రెవెన్యూ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని చిట్టిబోయనపల్లె వద్ద ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి పక్కనే కోట్లాది రుపాయలు విలువచేసే ప్రభుత్వభూములు ఉన్నాయి. సర్వేనంబరు 87/8లో రెండు ఎకరాల భూమి ఎవ్వరికి పట్టా ఇవ్వలేదు. ఈ ప్రాంతంలో భూముల విలువ అమాంతం పెరిగిపోయింది. ఎకరం భూమి రూ.2 కోట్లు వరకు విలువ పెరిగింది. దీంతో కొంతమంది కబ్జాదారుల కన్ను ఈ భూమిపై పడింది. గుట్టుచప్పుడు కాకుండా ఈ భూమిని స్వంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. ఇటీవల రెవెన్యూ అధికారులు సదరు భూమిని కబ్జాకోరుల నుంచి కాపాడుకోవడానికి సర్వే పనులు చేపట్టగా వాటిని కొంతమంది అడ్డుకొని రెవెన్యూ అధికారులను అక్కడి నుంచి పంపించి వేసిన సంఘటనలు చోటు చేసుకొన్నారు. కొన్నాళ్లుగా గుంభనంగా ఉన్న కబ్జాదారులు గత రెండురోజులుగా మళ్లీ తమ ప్రయత్నాలు తిరిగి ప్రారంభించారు. ఈనేపథ్యంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సదరు స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వేనంబరు 87/8లో ఎవరికి పట్టాలు ఇవ్వలేదని, ఇందులో ఎవరైనా ప్రవేశించినా, ఆక్రమించుకోవడానికి యత్నించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్‌ఓలు భరత్, ఫక్రుద్దీన్, వీఆర్‌ఏ పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం దశాబ్దాల పోరాటం

బి.కొత్తకోట : ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ దశాబ్దాల పోరాటం సాగించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు నరేంద్రబాబు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిన సందర్భంగా శనివారం బి.కొత్తకోటలో సంబరాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఈశ్వరప్ప, భవాని వెంకటేష్, సురేంద్ర, పలక రవి, చౌడప్ప, గంగరాజు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వకుండానే రీసర్వే

బి.కొత్తకోట : మండలంలోని బయ్యప్పగారిపల్లె గ్రామంలో జరుగుతున్న రీసర్వేకు సంబంధించి పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్నిరోజులు రెవెన్యూ బృందాలు రీసర్వే నిర్వహిస్తున్నారు. ఈ రీసర్వే నిర్వహణపై పాటించాల్సిన నిబంధనలు పాటించడం లేదని అంటున్నారు. ముందుగా రైతులకు రీసర్వే విషయమై నోటీసు అందించాక సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలి. అయితే సర్వే బృందాలు ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నారని పలువురు రైతులు చెప్పారు. అందులోనూ స్థానికంగా లేని రైతులు, పంటలు సాగులోని భూములకు రీసర్వే నిర్వహించాలంటే కొన్ని ఇబ్బందులు ఎదురువుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతుల సమక్షంలో వారికి ముందుగా సమాచారం ఇచ్చాక రీసర్వే నిర్వహిస్తే ఏ ఇబ్బందులుండవని చెబుతున్నారు. ప్రధానంగా వలసవెళ్లిన రైతులు రీసర్వేలో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ అందుబాటులోని వారికి ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నామని, స్థానికంగా ఉన్నవారికి నోటీసులు ఇస్తున్నట్లు చెప్పారు. ముందుగా నోటీసులు ఇవ్వడం ద్వారా వివాదాస్పద పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటే రైతులకు ఆమోదయోగ్యంగా ఉంటుందని చెబుతున్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

మదనపల్లె : వాహనదారులు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని డీఎస్పీ మహేంద్ర అన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో మదనపల్లి వన్ టౌన్ సీఐ, ఎరిషావలి, టూ టౌన్ సీఐ రామచంద్ర ఎస్‌ఐలు, వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు సలహాలు సూచనలు ఇస్తూ రోడ్డు ప్రమాదాలు, రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, సరైన రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, రోడ్డు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.మైనర్ బాల బాలికలు డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాల గురైవారి కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నయన్నారు. మైనర్ బాలబాలికలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

కురబలకోట : విద్యార్థులు లక్ష్యాన్ని సాధించి జీవితంలో రాణించాలని మదనపల్లె డీఎస్పీ ఎస్. మహేంద్ర అన్నారు. మండలంలోని అంగళ్లు విశ్వం డిగ్రీ కళాశాలలో లుమోరా–25 వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా చదువు సంధ్యలతో పాటు సాంకేతిక నైపుణ్యాలపై పట్టు సాధించాలన్నారు. కేరీర్ లెవన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల అధినేత విశ్వం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు.